## లింక్ రోడ్లను అభివృద్ధి చేయండి

మణికొండ: ఇరుకు రోడ్లు, తరచూ ప్రమాదాల నేపథ్యంలో ప్రజలు మృత్యువాత పడుతున్నారని మణికొండ మున్సిపాలిటీలో ఉందని, పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌లలో ప్రతిపాదించిన రోడ్లను అభివృద్ధి చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం వినతిపత్రాన్ని సమర్పించారు. మంత్రిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి మణికొండలో రోడ్ల పరిస్థితి, చేపట్టాల్సిన రోడ్ల అభివృద్ధిని వివరించారు.

## తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన



శంషాబాద్: తల్లిపాలు అమృతంతో సమానమని పెద్దషాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జూకల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాలలో ఉండే పోషక విలువలను వివరించారు. అప్పుడే పుట్టిన శిశువులకు కూడా ముర్రుపాలు తప్పకుండా తాగించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని మంచన్‌పల్లిలో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ వెంకటప్ప, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు గగన్‌పహాడ్‌కు రాంచందర్‌రావు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్‌పహాడ్‌కు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆదివారం రానున్నారు. గగన్‌పహాడ్‌లో కొత్తగా ఏర్పాటు చేయనున్న అగ్రసేన్ బ్యాంక్ బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించనున్నారు. పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా రాజేంద్రనగర్ సర్కిల్‌కు రానున్న నేపథ్యంలో బీజేపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం డివిజన్ల వారీగా ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసుకొని రాష్ట్ర అధ్యక్షుడికి ఘనంగా స్వాగతం పలికేందుకు తగు ఏర్పాట్లను ప్రారంభించారు.

## నేడు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సమావేశం

రాజేంద్రనగర్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరగనుంది. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బండ్లగూడ శారద ధామం శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ప్రత్యేక సమావేశం ఉంటుందని ఉత్సవ సమితి నియోజకవర్గ కన్వీనర్ వై.శ్రీధర్ తెలిపారు. సమావేశానికి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడు వైకుంఠం, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యవర్గ సభ్యులు రూప్‌రాజ్ తదితరులు పాల్గొంటారన్నారు.

## రాజేంద్రనగర్ అడిషనల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా సురేందర్‌రెడ్డి

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ అడిషనల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా బి.సురేందర్‌రెడ్డి నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన రవికుమార్ గత నెల రూ. 2 లక్షలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ స్థానానికి మెహిదీపట్నం సర్కిల్ ఉప కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సురేందర్‌రెడ్డిని నియమిస్తూ గ్రేటర్ కమిషనర్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. సురేందర్ రెడ్డి ఆదివారం ఉదయం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించనున్నట్లు సమాచారం.

# ‘నిథమ్’లో మహిళలకు ప్రత్యేక శిక్షణ

- చేపల ఆధారిత ఉత్పత్తులు, వ్యాపార నిర్వహణపై శిక్షణ
- ముగిసిన మరో విడత మహిళల శిక్షణ కార్యక్రమం



గచ్చిబౌలిలోని నిథమ్‌లో మహిళలకు చేపల ఔట్‌లెట్ల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



శిక్షణ పొందిన మహిళలతో చెఫ్, నిథమ్, సెర్ప్ అధికారులు



రాయదుర్గం: ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్ నిర్వహణపై చేపల విలువ ఆధారిత ఉత్పత్తులు, వ్యాపార నిర్వహణపై మలి విడత శిక్షణ శనివారం ముగిసింది. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ(సెర్ప్), పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ, గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్) సంయుక్తంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ పర్యవేక్షణలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంకే గణేశ్, సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ సతీష్, చెఫ్ తుల్జారామ్, నిథమ్ శిక్షణ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మిచెల జే ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం సాగింది. మహిళలకు రకరకాల చేపలతో ఫిష్ పకోడా, చేపల-65, కట్లెట్, రొయ్యల పలావ్, అపోలో చేపలు, వేడి వెల్లుల్లిలో చేపలు, చేప వేపుడు, చేప బిర్యానీ వంటి ఆహార పదార్థాల తయారీపై చెఫ్ తుల్జారామ్ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్ నిర్వహణ, ఆహారపదార్థాల తయారీ, పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పడం, నిర్వహణ వంటి అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ముగింపు సమావేశంలో సెర్ప్ సీఈఓ దివ్య మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా తమ సొంత కాళ్లపై నిలబడాలనే సంకల్పంతో ప్రభుత్వ చేపట్టే కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు సెర్ప్, నిథమ్ అధికారులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, శిక్షణ పొందిన వారు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు



హెచ్‌ఎం రమేష్‌నాయక్ దంపతులను సన్మానిస్తున్న డీఈఓ

అత్తాపూర్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు అన్నారు. శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న రమేష్‌నాయక్ పదవీ విరమణ వీడ్కోలు సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పదవీ విరమణ పొందుతున్న కిషన్‌నాయక్ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ విధి నిర్వహణలో చేసిన మంచి పనులు చిరస్థాయిగా గుర్తు ఉంటాయని అన్నారు. ఆయన నాయకత్వంలో, పాఠశాల అనేక మైలురాళ్లను సాధించింది, వాటిలో నూతన భావనలు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఎన్నో రావడం జరిగిందన్నారు. వృత్తి పట్ల అంకిత భావంతో పని చేశారని, ఉద్యోగం జీవితంలో వారు ఎన్నో అటుపోట్లను ఎదుర్కొన్నారన్నారు. పదవీ విరమణ అనంతరం వారి శేషజీవితం ఆనందంగా, సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్, మాజీ విద్యాధికారి రాంరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటి చైర్మన్ పడమటి శ్రీధర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునీత, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాఘవేందర్, ప్రవీణ్, జనార్ధన్‌చారి, గోపాల్, గోపాల్‌నాయక్, సుదర్శన్, నర్సింహ్మాచారి, శ్రీనివాస్‌సాగర్, వెంకటయ్య, సరళమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మీరాలం చెరువులో మొసళ్లు

శాస్త్రిపురం: మీరాలం చెరువు వద్ద మొసళ్లు సంచరిస్తుండంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లలోని పలు బస్తీలకు ఆనుకొని మీరాలం చెరువు విస్తరించి ఉంది. దీంతో చిన్నారులు. ఇళ్లలో పెంచుకునే మేకలు తరచు మీరాలం చెరువు వద్ద తిరుగుతుంటారు. చాలా వరకు బస్తీలకు ఆనుకొని ఉన్న మీరాలం చెరువుకు రక్షణ గోడ లేకపోవడంతో మొసళ్లు బయటకు వచ్చి తిరుగుతున్నాయి. మీరాలంలో పెరిగే మొక్కలను తినేందుకు మేకలు చెరువు వద్దకు వస్తుండటంతో మొసళ్లు వాటిని చెరువులోకి లాక్కొని వెళ్తున్నాయి. ఇటీవలి కాలంలో సులేమాన్‌నగర్ డివిజన్‌లోని సెట్విన్ కాలనీకి ఆనుకొని మీరాలం వద్ద రెండు మేక పిల్లలను మొసళ్లు చెరువులోకి లాక్కెళ్లాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో చిన్నారులను చెరువు పరిసర ప్రాంతాలకు పంపాలంటేనే భయంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వరదలో మొసళ్లు వచ్చాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మీరాలం చెరువులో మొసళ్లను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నియామకం

రాజేంద్రనగర్: బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరేశ్ ధోని నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని శనివారం పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, యువ నాయకుడు కార్తీక్ రెడ్డి, రాజేంద్రనగర్ సర్కిల్ పార్టీ ఇన్‌చార్జి పోరెడ్డి ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా నరేశ్ ధోని మాట్లాడుతూ... నియోజకవర్గంలోని విద్యార్థుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో విద్యార్థి విభాగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు స్పష్టం చేశారు.

## యూజీసీ బకాయిలను విడుదల చేయాలి



డైరెక్టర్ జనరల్‌కు వినతి పత్రం ఇస్తున్న టాసా నేతలు

ఏజీవర్సిటీ: విశ్వవిద్యాలయం అధ్యాపకులకు 2016 నుంచి రావాల్సిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా) ఆధ్వర్యంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ డాక్టర్ మంగీలాల్ జాట్‌ను కలిసి వినతిపత్రం అందిచారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి హైదరాబాద్ విచ్చేసిన ఆయనను శనివారం కలిశారు. ఇప్పటి వరకు రూ. 17.13 కోట్లమేర బకాయిలు ఉన్నాయని టసా నేతలు పేర్కొన్నారు. వీటిని విడుదల చేయడం వల్ల సుమారు 450 మంది విశ్వవిద్యాలయం బోధన సిబ్బంది పదవీ విరమణ పొందిన సిబ్బందికి లబ్ధిచేకూరుతుందని వివరించారు. స్పందించిన జాట్ కేంద్ర ఆర్థిక శాఖతో మాట్లాడి బకాయిల విడుదలకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. టాసా సంఘం అధ్యక్షుడు కె.పవన్‌చంద్రరెడ్డి, ఉపాధ్యక్షుడు కమలాకర్, ప్రధాన కార్యదర్శి చల్లా సౌజన్య, కార్యదర్శి రమేష్, కోశాధికారి ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ‘ఉల్లంఘనుల’కు జైలు శిక్ష

రాజేంద్రనగర్: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడంతో పాటు మద్యం సేవించి.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా తదితర ఉల్లంఘనలకు పాల్పడి ట్రాఫిక్ పోలీసులకు చిక్కిన 66 మందిని శనివారం రాజేంద్రనగర్‌లోని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. వీరంతా గతంలో నార్సింగి, రాజేంద్రనగర్, రాయదుర్గం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుపడ్డారు. దీంతో పోలీసులు శనివారం వారిని రాజేంద్రనగర్ మూడవ స్పెషల్ ఎంఎం కోర్టు న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. దీంతో న్యాయమూర్తి 10 మందికి మూడు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మిగిలిన వారికి జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మరోసారి ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే మోటార్ వాహన చట్టం సెక్షన్ 182 ప్రకారం 3 నెలల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు.

## ఉపాధ్యాయులకు పీఆర్‌సీని ప్రకటించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్‌సీని ప్రకటించాలని తెలంగాణ పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తమ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే నరవేర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యల పరిష్కారానికి తమ యూనియన్ తరఫున పోరాటం చేస్తామన్నారు. తమ యూనియన్‌కు పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేపట్టామన్నారు. మండల శాఖ అధ్యక్షుడు వి.శివరాం, ప్రధాన కార్యదర్శి ఎ.మధుకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వి.నిరంజన్, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, కవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, ఇమ్రాన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం




ఎమ్మెల్సీ కొమురయ్యకు మెమొంటో అందజేస్తున్న కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మహవీర్ గ్రూప్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి స్వర్గీయ సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి సంస్మరణ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నిజామాబాద్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య టోర్నీని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ... నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత ఆటలకు అధిక ప్రోత్సాహం ఇస్తున్నారన్నారు. ఖేలో ఇండియాలో భాగంగా అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పతకాలను సాధించి భారత ప్రతిష్టను ప్రపంచానికి చాటారన్నారు. కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ... మహవీర్ కళాశాల గత 22 సంవత్సరాల నుంచి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తుందన్నారు. క్రీడాకారులకు ఇండోర్ ఏసీ హాల్ ఏర్పాటు చేసి ఉచితంగా భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, కోశాధికారి అగ్నిహోత్రి, మెంటర్ ప్రకాష్‌రాజ్, చీఫ్ రిఫరీ లక్ష్మీకాంత్ తదితరులు హాజరయ్యారు. అండర్ 11, 13 బాలికలకు ఎలిమినేషన్ పోటీలను నిర్వహించగా 300 మంది బాలబాలికలు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి

బీజేపీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి



మహాధర్నాలో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: కాంగ్రెస్ పాలకులు ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే నెరవేర్చాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మోసపూరిత బీసీల రిజర్వేషన్‌లో 10 శాతం రిజర్వేషన్ ముస్లింలకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని నిలదీసి పూర్తిగా బీసీల కోసం రిజర్వేషన్ 42 శాతం కేటాయించాలని ఇందిరాపార్కు వద్ద మహాధర్నాలో రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, నేతలు జోగి రవి, నారగూడెం మల్లారెడ్డి, రావుల భాస్కర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గోదాపాండుయాదవ్, మాజీ అధ్యక్షులు అడికే జనార్ధన్, నెల్లుట్ల జగన్, సంతుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ ధర్నాకు తరలిన బీజేపీ నేతలు



మణికొండ నుంచి ధర్నాకు వెళ్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: నగరంలోని ధర్నా చౌక్ వద్ద శనివారం నిర్వహించిన ధర్నాకు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల నుంచి పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు ఎం. నగేష్ యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు జనాభా ప్రాతిపదికన ఇవ్వాల్సిన 42 శాతం రిజర్వేషన్లను ఏకంగా పది శాతం తగ్గించి దాన్ని మైనార్టీలకు ఇస్తుందన్నారు. దాంతో బీసీలకు 32 శాతం రిజర్వేషన్లే దక్కి వారు తీవ్రంగా నష్ట పోతారన్నారు. బీజేపీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివరాంరెడ్డి, నాయకులు వందన నగేష్, ఇందిర, అనిత, లక్ష్మి, వెంకటాచారి, మధు, బి.శివకుమార్, ఆనంద్‌రావు, శంకర్‌సింగ్, వేణు, వై.యాదయ్య, నార్సింగి మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు సి.హెచ్.భిక్షపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ పరిధిలోని నాయకులు...

రాజేంద్రనగర్: ధర్నా చౌక్ వద్ద జరిగిన ధర్నాకు బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పార్టీ నేతలు నాయకులు వై.శ్రీధర్, హరికిషన్, జి.బాబురావు, సోల్జర్ రెడ్డి, వనిత రెడ్డి, బండారి బాలకృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, తిరుమలేష్, మల్లేష్ చారి, సురేందర్, శ్రీనివాస్ రెడ్డి, శివ మాగాణి, రాజ్ కుమార్ యాదవ్, పద్మావతి, సరిత రెడ్డి, అంబికా, పర్వతాలు యాదవ్, విజయ్ యాదవ్, శివ, గోపాల్ ముదిరాజ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ డ్రైవ్‌లతో సమస్యల సత్వర పరిష్కారం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: స్పెషల్ డ్రైవ్‌లను చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మధుబన్ కాలనీలో మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్‌ను వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సదర్భంగా విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఏఎంహెచ్‌వో రజనీకాంత్, డిపివో స్వాతి, వెటర్నరీ శ్రీకాంత్, ఎంటమాలజీ ఏఈ ఉదయ్‌కిరణ్, శానిటరీ జవాన్ శేఖర్, రాంకీ నర్సింహారెడ్డి, ఎస్‌ఎఫ్‌ఏ జాషువా, విశాల్, ఎంటమాలజీ సీవో విజేందర్, ఆర్‌పీలు , ఉడుత లక్ష్మి, నాయకులు బుచ్చిరెడ్డి, ఎల్.వి.రెడ్డి, నర్సింహారెడ్డి, గోవర్ధన్, కిషోర్, ఉత్తమ్, కృష్ణారెడ్డి, అవినాష్, సత్యం, రాజ్‌కుమార్, రామకృష్ణ, అమరేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు గోపన్‌పల్లిలో చిత్తారమ్మ ఆలయ బోనాలు

రాయదుర్గం: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని చిత్తారమ్మ ఆలయ బోనాలను ఆదివారం నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఆలయంలో ప్రత్యేకంగా చిత్తారమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయం ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని, సాయంత్రం 4 గంటలకు తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

## సుంకర రామచంద్రరావుకు నివాళి

గచ్చిబౌలి: సీనియర్ జర్నలిస్ట్, అనువాద రచయిత డాక్టర్ సుంకర రామచంద్రరావుకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ సుంకర రామచంద్రరావు సంస్మరణ సభకు మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామచంద్రరావుతో కలిసి జర్నలిస్ట్‌గా, నక్సల్‌బరీ ఉద్యమంలో కలిసి పని చేశామన్నారు. తాను నమ్ముకున్న సిద్ధాంతంతో పని చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఏ విషయంలోనూ రాజీపడే వారు కాదని స్పష్టం చేశారు.

## వీడ్కోలు.. సత్కారం

రాజేంద్రనగర్: శివరాంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్ మాస్టర్ ఎం.కిషన్ నాయక్ ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను డీఈఓ సుశీంద్రరావు నేతృత్వంలో సహచర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... శివరాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల కిషన్ నాయక్ ఆధ్వర్యంలో మంచి అభివృద్ధి సాధించిందన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... శివరాంపల్లి పాఠశాల పైలెట్ ప్రాజెక్టు కింద సెలెక్ట్ కావడం ఎంతో ఆనందించగద్ద విషయం అన్నారు. తద్వారా పాఠశాల అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునీత, రాజేంద్రనగర్ ఎంఈఓ శంకర్, మాజీ ఎంఈఓ రాంరెడ్డి, వివిధ సంఘాల నాయకులు, పీఆర్‌టీయు మహేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాఘవేందర్, ఎస్‌టీయూ నేత ప్రవీణ్, ఎస్‌టీఎఫ్ నేతలు జనార్ధన్ చారి, గోపాల్, యూటీఎఫ్ నాయకుడు గోపాల్ నాయక్, మండల సంఘాల నాయకులు సుదర్శన్, శ్రీనివాస్ సాగర్, వెంకటయ్య, సరళమ్మ తదితరులు పాల్గొన్నారు.



కిషన్ నాయక్‌ను సన్మానిస్తున్న డీఈఓ